క్లుప్తంగా

మండల స్పెషలాఫీసర్‌గా కరుణశ్రీ

యద్దనపూడి: యద్దనపూడి మండల స్పెషల్ ఆఫీసర్‌గా కరుణశ్రీ శనివారం బాధ్యతలు చేపట్టారు. డిస్ట్రిక్ మేనేజర్ ఫర్టిలైజర్స్ ఏపీ మార్క్‌ఫెడ్ అధికారిగా పనిచేస్తున్న కరుణశ్రీని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో తహశీల్దారు రవికుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీపీ పులగం రజనీ, జెడ్పీటీసీ చుండి లక్ష్మీనారాయణమ్మ, ఇతర శాఖల అధికారులు కలిసి అభినందించారు. మండల అభివృద్ధికి సమన్వయంతో కలిసి పనిచేద్దామని ఆమె సూచించారు.

డేటా ఎంట్రీ కోర్సులో ఉచిత శిక్షణ

పర్చూరు (చినగంజాం): పర్చూరు బీఏఆర్ అండ్ టీపీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో మూడు నెలల పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణను ఇవ్వనున్నట్లు సంస్థ జిల్లా అధికారి ఈ తమ్మాజీరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఉపాధి అవకాశం కూడా కల్పించనున్నట్లు ఆయన తెలిపారు. 10వ తరగతి ఆపై చదువులు పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు సంస్థ ప్రతినిధి పీ వినోద్ కుమార్ 63027 64962ను సంప్రదించాలని సూచించారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన



ఓటు వేసేందుకు క్యూలో నిలబడిన విద్యార్థినులు

పర్చూరు (చినగంజాం): స్థానిక ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ విద్యార్థులకు ఎన్నికల నిర్వాహణపై శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనదని ఈసందర్భంగా వారు విద్యార్థులకు తెలిపారు. తాత్కాలిక ఎన్నికల నమూనా కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు చూపించారు. నామినేషన్‌ల స్వీకరణ, ఉప సంహరణ, పోలింగ్, కౌంటింగ్, ప్రమాణ స్వీకారం తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు ప్రిన్సిపాల్ షాఫియా బేగం తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుంటుపల్లి పీహెచ్‌సీ డాక్టర్‌గా రవితేజ



బల్లికురవ: గుంటుపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెండో వైద్యుడుగా జీ. రవితేజను నియమించింది. శనివారం నియామక పత్రంతో విధులు బాధ్యతలు చేపట్టారు. 2022 సెప్టెంబర్‌లో వైద్యారోగ్య శాఖమంత్రి విడదల రజని పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీతో విధులకు గైర్హాజరవుతున్న వైద్యుడు జీ. భానుప్రకాష్‌రావును అక్కడిక్కడే సస్పెన్షన్ వేటు విధించటం తెలిసిందే. ప్రభుత్వం నూతన వైద్యులు నియామకం 104లో కాంట్రాక్ట్ వైద్యుడిగా పనిచేస్తున్న రవితేజకు బాధ్యతలు అప్పగించింది. గ్రామీణ ప్రాంతాల్లోని పేదల ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని ఆయన చెప్పారు.


కొప్పరపాలెంలో కోలాహలంగా ఇరుముడులు



కొప్పరపాలెంలో అయ్యప్పల గ్రామోత్సవం

బల్లికురవ: అయ్యప్ప, వెంకటేశ్వరస్వామి, మాలతో 41 రోజులు కఠోర దీక్షలు చేపట్టిన కొప్పరపాలెం గ్రామంలోని 25 మంది భక్తులు శనివారం గ్రామోత్సవంతో స్థానిక వినాయకుడి ఆలయంలో ఇరుముడులు కట్టించుకున్నారు. గురుస్వాములు, దీక్షితులు, నర్రా అంజిబాబు, మారెళ్ల పిచ్చయ్య స్వాములకు ఇరుముడులు కట్టారు. శబరిమల తిరుమల యాత్రకు అనుమతి కోరుతూ గ్రామ దేవతలను దర్శించుకుని గ్రామోత్సవంతో శరణుఘోషను చెప్పుకున్నారు. గ్రామానికి చెందిన 25 మంది స్వాములు ఒకేసారి యాత్రకు బయలుదేరటం బంధుమిత్రుల రాకతో ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొంది.

విద్యతో పాటు ఆటలు కూడా ముఖ్యమే



బహుమతులు అందిస్తున్న సీఐ సోమశేఖర్

చీరాల అర్బన్: విద్యతో పాటు ఆటలు కూడా విద్యార్థులకు అవసరమని టూటౌన్ సీఐ సోమశేఖర్ అన్నారు. శనివారం కొత్తపేటలోని నారాయణ స్కూల్‌లో నారాయణ ప్రీమియర్ లీగ్ ఆటల పోటీలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టూటౌన్ సీఐ సోమశేఖర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ-క్రిడ్జ్ పిల్లలందరికి ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులను సీఐ చేతుల మీదగా అందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయి పావని, అడకమిక్ డీన్ శ్రీకృష్ణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ నిధులు ఉపయోగించుకోవాలి



దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందిస్తున్న ఎమ్మెల్యే కరణం



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కరణం

- దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత
- ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చీరాల: ముఖ్యమంత్రి సహాయనిధి కింది ఇచ్చిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. పట్టణంలోని 22వ వార్డుకు చెందిన మూడు సంవత్సరాల గీతాంష్‌కు చెవి సమస్య వలన ఆపరేషన్ నిమిత్తం రూ.5.50 లక్షల ఎన్‌ఓసిని ఎమ్మెల్యే చేతుల మీదగా బాలుడి తండ్రి పల్లపు శ్రీనివాసరావుకు శనివారం అందించారు. కార్యక్రమంలో చీరాల మండల వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి కప్పల సాయిరెడ్డి, కోడూరి ప్రసాద్‌రెడ్డి, చిన్నం చిట్టిబాబు, అక్కల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలానే పట్టణంలోని హారిస్‌పేటకు చెందిన లంక భాస్కర్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే అందించారు. నాయకులు మల్లెల రాజశేఖర్ పాల్గొన్నారు.

ట్రైసైకిల్ పంపిణీ..

పుట్టుకతోనే దివ్యాంగుడైన చీరాల మండలం తోటవారిపాలేనికి చెందిన కొట్టేటి సాయికి ట్రైసైకిల్‌ను ఎమ్మెల్యే కరణం అందించారు. శనివారం మండలంలోని రామకృష్ణాపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ట్రైసైకిల్‌ను ఎమ్మెల్యే అందించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య మాట్లాడుతూ ట్రైసైకిల్ లేక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే ఆయన స్పందించి దివ్యాంగుడికి ట్రైసైకిల్ అందించారన్నారు. అలానే ఆ దివ్యాంగుడికి ఇంటి స్థలం విషయంలో ఏ సమస్యలు ఉన్నా పరిష్కరిస్తానని ఎమ్మెల్యే తెలిపారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఆసాది అంకాలరెడ్డి, మంకెన శ్యామ్‌ప్రకాష్, పి.విష్ణు, ఈశ్వర్, టి.వెంకటేశ్వరరావు, పి.మధుబాబు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుడి భార్యకు ఆర్థిక సాయం చేస్తున్న హనుమంతురావు

జే.పంగులూరు: అనారోగ్యంతో మృతి చెందిన బేల్దారి కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు. మండల పరిధిలోని పంగులూరు గ్రామానికి చెందిన తన్నీరు అనిల్ కుమార్ (37) అనారోగ్యంతో ఒంగోలు ప్రైవేటు వైద్యశాలలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి మృతుని కుటుంబ సభ్యులకు శనివారం రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందించారు. నగదును మండల నాయకుడు స్వయంపు హనుమంతురావు మృతుడి భార్య రాజేశ్వరికి అందించారు. చిన్నవయస్సులోనే భర్తను కోల్పోయిన రాజేశ్వరి, ఆమె ఇద్దరి ఆడపిల్లలకు పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కుటుంబ సభ్యులను సానుభూతి తెలియజేశారు. కో ఆప్షన్ సభ్యుడు ఖాశీం, వైఎస్సార్ సీపీ నాయకులు బాజీ, జాఫర్, బుల్లెయ్య, భాను, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

నేడు అద్దంకికి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి రాక

అద్దంకి రూరల్: నూనతంగా నియమితులైన వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి ఆదివారం అద్దంకికి రానున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ప్రకటనలో తెలిపారు. శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకుని పూజలు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం విలేకర్ల సమావేశం, పలువురు స్థానిక నేతలతో మాట్లాడాతామన్నారు. సీనియర్ నాయకుడు, అద్దంకి మాజీ ఎమ్మెల్యే బాచిన చెంచుగరటయ్య, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, మాజీ అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యలను త్వరలో కలిసి వారిసహాయ సహకారాలను కోరతానన్నారు.

ఎమ్మెల్యే, ఎంపీలను కలిసిన హనిమిరెడ్డి



ఎంపీ సురేష్‌ని కలసిన నియోజకవర్గ ఇన్‌చార్జి హనిమిరెడ్డి, బల్లికురవ నేతలు



ఎమ్మెల్యే బలరాంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న హనిమిరెడ్డి



ఎంపీ మోపిదేవిని సత్కరిస్తున్న హనిమిరెడ్డి

బల్లికురవ/చీరాల: చీరాల శాసన సభ్యుడు, సీనియర్ రాజకీయ నాయకుడు కరణం బలరామకృష్ణమూర్తిని శనివారం ఒంగోలులో అద్దంకి నియోజకవర్గ నూతన వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అద్దంకి ఇన్‌చార్జిగా నియమితులైన హనిమిరెడ్డిని ఎమ్మెల్యే కరణం సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గంలో పార్టీ పరిస్థితితో పాటు పార్టీ బలోపేతానికి హనిమిరెడ్డికి ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. అలాగే బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌ను శనివారం హనిమిరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి మర్యాద పూర్వకంగా కలిశారు. త్వరలో జరిగే ఎన్నికల్లో తనకు పూర్తి మద్దతు ఇవ్వాలని, అద్దంకిలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పనిచేస్తానని చెప్పారు. అంతేకాకుండా తమ కుటుంబం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటుందని హనిమిరెడ్డి ప్రకటించారు. ఎంపీని కలిసిన వారిలో వల్లాపల్లి సొసైటీ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసరెడ్డి, కూకట్లపల్లి సర్పంచ్ ఇప్పల అయ్యప్పరెడ్డి, పార్టీ బాపట్ల జిల్లా మెంబర్ కల్లి అంజనీ ప్రసాదరెడ్డి, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి రూరల్: అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి శనివారం బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావును ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు.

మళ్లీ సీఎంగా జగనన్న అవడం ఖాయం



నాగండ్లలో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న నాయకులు, అధికారులు



చీరాలలో లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల పత్రాన్ని అందిస్తున్న నాయకులు

చీరాల టౌన్: రాష్ట్రాభివృద్ధితో పాటు సంక్షేమ రాష్ట్రంగా కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకునే బాధ్యత అందరిపై ఉందని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని సాల్మన్‌సెంటర్ గ్రామ పంచాయతీల్లో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేషన్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, ఎస్టీసెల్ అధ్యక్షులు ఎన్.రాజ్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షులు ఎ.అంకాళరెడ్డిలు గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతి సామాజిక వర్గానికి, ప్రతి ఇంటికి, ప్రతి ఒక్కరికి కలిగిన మేలు, రాష్ట్ర ప్రగతి గురించి కరపత్రాల ద్వారా ఇంటింటికి తిరిగి వివరించారు. గడిచిన నాలుగున్నరేళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమానికి ప్రవేశపెట్టిన పథకాలు, నవరత్నాలు మళ్లీ అందరికి అందాలంటే సీఎంగా వైఎస్ జగనన్నను మళ్లీ గెలిపించుకోవాలన్నారు. అనంతరం సచివాలయాల వారీగా సంక్షేమ పథకాల బ్రోచర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బి.శివపార్వతి, జేసీఎస్ కన్వీనర్ బి.సాంబశివరావు, డి.జయరావు, షేక్ ఆజాద్, కోటేశ్వరరావు, జితేందర్, మురళీ, నారాయణ, వెంకటేశ్వరమ్మ, బుజ్జి, సుబ్బారావు, పోతురాజు, అశోక్, అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, గృహ సారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని నాగండ్ల గ్రామ సచివాలయ పరిధిలో శనివారం ఆంధ్ర ప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బండారు ప్రభాకరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. సచివాలయ పరిధిలో ప్రభుత్వం అందించిన లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లే బోర్డును పార్టీ కన్వీనర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పీ వెంకటేశ్వరరావు, మండల జేసీఎస్ కన్వీనర్ షేక్ మస్తాన్ వలి, గ్రామ సర్పంచ్ కే పద్మావతి, సీనియర్ నాయకులు ఇసుకపల్లి బలరాం రాజు, సచివాలయ కన్వీనర్ ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు, కొమ్ముతోటి సుజాత, వార్డు సభ్యుడు షేక్ హుస్సేన్, నాయకులు రాయపాటి పూర్ణచంద్రరావు, నందిగం గిరి, గాడిపర్తి ఆంజనేయులు, కయ్యాల సుబ్బారావు, నాగండ్ల భిక్షాలు, కే నరసింహారావు, ఇంటూరి రామస్వామి, తన్నీరు కోటేశ్వరరావు, గంట అరుణ, వలంటీర్‌లు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు

మేదరమెట్ల: ప్రతిభ కనపరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. యలగాల సుబ్బారావు ద్వితీయ స్మారక ప్రతిభ పోటీలను శనివారం కొరిశపాడు మండలం రావినూతల జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించారు. ఇందులో భాగంగా జే.పంగులూరు, కొరిశపాడు, అద్దంకి, ఇంకొల్లు మండలాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు వరుసగా మూడు కేటగిరీల్లో ఓసీ, బీసీ, ఎస్సీ ఎస్టీలకు మొదటి బహుమతిగా రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు అందించారు. ఓసీ కేటగిరిలో మొదటి బహుమతి బీ శివాని (బూదవాడ), రెండో బహుమతి, ఆర్ సాంబశివ మహేష్ (జే. పంగులూరు), మూడో బహుమతి ఎం కాశీవిశ్వనాథ్ (పావులూరు)లు నిలిచారు. బీసీ కేటరిగిలో మొదటి బహుమతి హరిప్రకాశ్ (చందలూరు), రెండో స్థానంలో సీహెచ్ హారిక (చందలూరు), మూడోస్థానంలో ఎస్కే గౌస్‌బాషా(బూదవాడ)లు నిలిచారు. ఎస్సీ, ఎస్సీ కేటగిరిలో మొదటి బహుమతిగా బీ ఉమామహేశ్వరి (మేదరమెట్ల), రెండో స్థానంలో వై సౌమ్య (బూదవాడ), మూడోస్థానంలో అభిమన్యశ్రీ (చక్రాయపాలెం)లు నిలిచారు. అంతే కాకుండా పోటీల్లో విశేష ప్రతిభను కనబరచిన విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మొత్తం రూ.1.20 లక్షల నగదు బహుమతులు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నో బ్యాగ్ డేతో మానసిక ఉల్లాసం

కారంచేడు: పాఠశాలల్లో నో బ్యాగ్ డేతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని స్వర్ణపాలెం, కారంచేడు, కుంకలమర్రు మెయిన్, ఆదిపూడి గ్రామాల్లో నో బ్యాగ్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెడుతూ యోగాలు, పాఠశాల ఆవరణంలోని పూలతో అందంగా బొకేలు తయారు చేశారు. అట్ట ముక్కలు పేపర్లతో వివిధ రకాల ఆకృతులు, బొమ్మలు గీయడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఎంపీడీవో పీ లక్ష్మీనారాయణ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసారు. కార్యక్రమంలో నరసింహారెడ్డి, పీ కోటేశ్వరరావు, కుకింగ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండ



కుళ్లిపోయిన మిరప మొక్కలు పరిశీలిస్తున్న తహశీల్దారు

కారంచేడు: మిచాంగ్ తుఫాను ప్రభావంతో కారంచేడు మండలంలోని అనేక గ్రామాలకు చెందిన రైతులు తీవ్రంగా నష్టపోయారని, వీరందరికీ ప్రభుత్వం అండగా ఉంటుందని తహశీల్దారు ఎస్ వెంకటరత్నం అన్నారు. శనివారం ఆయన మండలంలోని కారంచేడు, స్వర్ణ, కొడవలివారిపాలెం ప్రాంతాల్లోని ముంపు ప్రాంత పంట భూములను ఆయన రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందితో కలసి పరిశీలించారు. ఈ ప్రాంతంలో ప్రధానంగా వరి, మిరప, పొగాకు, శనగ పంటలు దెబ్బతిన్నాయన్నారు. రెవెన్యూ, వ్యవసాయశాఖల సిబ్బంది గ్రామాల్లో నిర్వహిస్తున్న పంట నష్ట అంచనా వివరాలను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఏ ఒక్క రైతుకి అన్యాయం జరగదని, రైతులందరూ ధైర్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఓ కే సుధీర్‌బాబు, వీఆర్ఓలు, వీహెచ్‌ఏలు, ఆర్‌బీకేల సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలు దూరం



ట్రాఫిక్ నియమాలను వివరిస్తున్న ఒన్‌టౌన్ సీఐ శేషగిరిరావు

చీరాల: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం అవుతాయని ఒన్‌టౌన్ సీఐ పి.శేషగిరిరావు సూచించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలో 'నో యాక్సిడెంట్ డే' కార్యక్రమం నిర్వహించారు. సీఐ శేషగిరిరావు, చీరాల ట్రాఫిక్ ఎస్సై గోపి, సిబ్బందితో కలిసి పట్టణంలోని ప్రధాన వీధులైన గడియార స్తంభం సెంటర్, మార్కెట్ సెంటర్, ముక్కోణం పార్కు కూడలి, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో వాహనదారులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలు నడిపే వారు విధిగా హెల్మెట్లు ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. సీఐతో పాటుగా ట్రాఫిక్ పోలీసులు, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

జీవధ్వజ స్తంభానికి క్షీరాభిషేకం



ధ్వజ స్తంభానికి ధాన్యాధివాసం చేస్తున్న భక్తులు

చీరాల అర్బన్: కొత్తపేటలోని ఐఎల్‌టీడీ కాలనీలో గల ఓంకార క్షేత్రంలో ఆదివారం నూతన జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం ప్రతిష్ఠంచనున్న స్తంభానికి క్షీరాభిషేకం, ధాన్యధివాస కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 9.24 నిమిషాలకు ప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఓంకార క్షేత్ర ఆలయ కమిటీ అధ్యక్షుడు తొగురు సత్యనారాయణ తెలిపారు. ధ్వజ స్తంభ దాతలు ఎస్ఆర్‌ఐ ప్రతాప్, ఎం.నాగేశ్వరరావు దంపతులు, శివారెడ్డి, కమిటీ కార్యదర్శి రామకృష్ణశర్మ, కోశాధికారి జీవీఎల్ రమణ, కమిటీ సభ్యులు అల్లంశెట్టి తిరుమల, కొతా కృష్ణ, నరేంద్ర, బి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు పూసపాడులో వైద్యశిబిరం

పర్చూరు (చినగంజాం): రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ ఆధ్వర్యంలో 17వ తేదీ ఆదివారం మండలంలోని పూసపాడు గ్రామంలో విఘ్నేశ్వర సేవా సమితి ఆవరణలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు తెలిపారు. వైద్యశిబిరం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 3.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మద్దినేని సుధాకర్ పాల్గొన్నారు.



